# పెట్టుబడి

పాపాయమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ఆమె చెప్పినవన్నీ వింటూ సానుభూతిగా తలపంకిస్తూ కూర్చుంది శకుంతల.

"ఇసువంటి బతుకు బతక్కూడదమ్మగారూ, ఏంచేస్తాం? సావలేక బతుకుతున్నాం" అంది పాపాయమ్మ.

అక్కడే ఒక పక్కగా గున్నమ్మ తలొంచుకుని కూర్చుంది. గుండ్రటి ముఖం, చామనచాయగా వున్నా నున్నగా కలకల్లాడుతూవుంది. నయాపైసంత బొట్టు, కళ్ళకి నల్లగా తీర్చిన కాటుక, అందంగా దువ్వుకున్న జుట్టు, కుదురుగా వున్న జడ, గున్నమ్మ చక్కని చుక్క.

చక్కదనానికి డబ్బు వుండడంతో లేకపోవడంతో సంబంధం లేదనుకుంది శకుంతల.

"అమ్మగారూ, మీరే సూడండి. సక్కనిసుక్క. అదే దానికి పాపం అయిపోయింది. దానికి సుఖం లేదమ్మగారూ ఆడికి అనుమానం. ఆ సచ్చినోడికి దీని అందవంటె గిట్టదు. ఎవ్వడైనా దీనొంక సూస్తాడని ఆడికి బయ్యం" గున్నమ్మ కళ్ళెత్తి పాపాయమ్మకేసి చూసింది. ఆ చూపులో ఏముందో, పాపాయమ్మకి ఏమర్థమైందో తెలీదుగానీ ఆమె మాత్రం తన ధోరణి ఆపలేదు. చటుక్కున లేచి శకుంతల కాళ్ళదగ్గర కూలబడి "అమ్మగారూ, దీనికో దారి సూపించండి. ఇది నా సొంత సెల్లెలు కన్నా ఎక్కువమ్మగారూ, పొట్టకింత కూడులేక ఈనంగా ఏడుస్తావుంది - అమ్మగారూ ఒక్కమాట అయ్యగారితో సెప్పండి - దీనికి గుప్పెడు మెతుకులు దొరికే సాయం సెయ్యండి తల్లీ - మీకు పున్నముంటాది" అంటూ కాళ్లావేళ్ళా పడింది.

"బాగానేవుంది లేవే, నాకూ జాలిగానేవుంది. అయితే మాత్రం నేనేం చెయ్యనూ" అంటూ లేచి వొళ్ళువిరుచుకుంది బద్ధకంగా శకుంతల.

"ఆమాటనబోకండి, మీరనుకుంటె సెయ్యగలరు"...అని ఒక్క క్షణం ఆగి 'ఏటమ్మగారూ, ఎందుకు లేచారూ, ఏంకావాలీ" అంటూ అడ్డు పడింది పాపాయమ్మ.

"ఎంలేదుగానీ, కాసిని టీకి నీళ్ళు పడెయ్" అంది శకుంతల.

పాపాయమ్మ మళ్ళీ మొదలుపెట్టింది.

"బంగారం లాంటిదాన్ని సావసితకబాదుతాడమ్మా- వున్నాడు వున్నట్టుండడు. తాగి మరీ వస్తాడు. కాసింత కడుపులోకి కూడువుంటే, దెబ్బలు తినడానికైనా సత్తువుంటాది" అంది.

"ఇంతకీ ఏం చేయమంటావూ" అంటూ కుర్చీలో వెనక్కి జారగిల పడింది శకుంతల.

పాపాయమ్మ ఆఫీసులో స్వీపరుగా పనిచేస్తోంది. ఆ ఆఫీసుకి శకుంతల భర్త అధికారి. పాపాయమ్మకున్న పదేళ్ళ సర్వీసుతో ఆఫీసుల్లో చాలా విషయాలు ఆకళింపు చేసుకుంది. ఆ అనుభవంతోటే మాట్లాడడం మొదలు పెట్టింది.

"మన ఆఫీసులో నీళ్ళు మొయ్యడానికి మనిషి కావాలండి. ఒక్క-పంపులో నీళ్ళు రావడంలేదు. రెండు అంతస్థులు ఎక్కాలి నీళ్ళతో,-మీరు కాస్తంత దయ సూపండి. అయ్యగారితో సెప్పండి" అంటూ వాపో యింది-

"చూద్దాంలే" అంటూ శకుంతల పుస్తకం తీసుకుని చదువుకోవడం మొదలుపెట్టింది.

శకుంతలది జాలిగుండె. ఎవరైనా కష్టాల్లో వున్నారంటే ఏదో విధంగా సహాయం చెయ్యాలని చూస్తుంది. ముఖ్యంగా భర్త సరిగ్గాచూడని స్త్రీలంటే ఆమెకి మరీ జాలి. అందులో చక్కగా బుద్ధిమంతురాలిగా కనిపించిన గున్నమ్మని చూస్తే ఆమె మనసు మరీ జాలితో నిండిపోయింది. ఆమె ఏదైనా చెప్తే భర్త కాదనడు. ఆ ధైర్యంతోటే ఆమె అప్పుడప్పు డిలాంటివి సమయం చూసి చెప్తూం వుంటుంది.

o o o

కుండలో అన్నం కుతకుత ఉడుకుతోంది గున్నమ్మ పుల్లలు ఎగసనదోస్తూ ఆలోచిస్తోంది. తననాలుగు డబ్బులొస్తే హాయిగా, ఆనందంగా గడిచిపోతుంది. పాపాయమ్మక్కాయి తనకు పని యిప్పిస్తానంది. వంట్లో సత్తువుంది కనుక నీళ్లు మొయ్యగలదు. పాపాయమ్మక్క మాటలు చిత్రంగా వుంటాయి. అవన్నీ తను పట్టించుకోకూడదు. ఉన్నవీ లేనివీ చెప్పేస్తుంది. అక్కాయికి కళ్ళలో నీళ్ళు చిటికెలో వస్తాయి. కథలు చెప్తుంది. క్షణంలో ఎన్నో కల్పిస్తుంది.

"గున్నమ్మా" అన్న పిలుపువిని ఆలోచనల్లోంచి లేచింది గున్నమ్మ. పాపాయమ్మని తల్చుకున్నంతలో ప్రత్యక్షమైందని ఆశ్చర్యపోతూ గుమ్మం వైపు నడిచింది.

"ఇప్పుడే తల్చుకుంటూవున్నా, అంతలోనే వచ్చావు" అంటూ పాపాయమ్మని ఆహ్వానించింది.

"కూకోడానికి లేదులే. పనిపడిపోతున్నా" అని నిలబడింది పాపాయమ్మ. గున్నమ్మ రొంటిలోంచి పదిహేను రూపాయలు తీసి ఆమెకిచ్చింది.

"ఇప్పటికిది వుండనియ్యి. మళ్ళీ సూసి యిస్తానక్కా" అంది గున్నమ్మ. పాపాయమ్మ ఆసంతృప్తిగానే డబ్బు అందుకుంది.

"నీకు పనైందటో...డబ్బుకి లోటే వుండదు" అంటూ జాకెట్టులో ఆ పదిహేను రూపాయలు పెట్టేసుకుంది. గున్నమ్మ మాట్లాడలేదు. అంగీకారంగా చూసింది. పాపాయమ్మ గుడిసె బయట కొచ్చింది. డబ్బులైతే యిచ్చేసిందిగాని గున్నమ్మ కెలాగో అనిపించింది.

తనకి ఆఫీసులో నీళ్ళపని యిప్పిస్తానని యిప్పటికి నలభై రూపాయలు తీసుకుంది. మావ ఎంతో కష్టపడి సంపాదించుకున్న డబ్బు. తను కడుపు కట్టుకుని కూడబెట్టుకున్న డబ్బు యిలా చేస్తోంద తను. రేపు పాపాయమ్మ తొంటచెయ్యి చూపిస్తే తను మావ దగ్గర తలెత్తుకుని తిరగ్గలదా?

లింగయ్య వస్తూనే గున్నమ్మని అడిగాడు.

"ఏమంద పాపాయమ్మ" అని.

"దానిసేతుల్లోగాని వుందేటి. యియ్యటానికి? అడగాలా, అవ్వాలా" అంటూ దీర్ఘం తీసింది గున్నమ్మ.

లింగయ్య మరేం మాట్లాడలేదు. కడుపునిండా వేడివేడి అన్నం తిని, ఆరుబయట నులకమంచం మీద వెల్లకిలా పడుకుని ఆకాశంకేసి చూస్తూ పక్కనే కూర్చున్న భార్యతో అన్నాడు.

"గున్న - నీకేదోపని దొరక్కపోతే మనకొచ్చిన కష్టమేమీ లేదు- మరేం పర్లేదు" అన్నాడు. అతని మంచి మనసుకి గున్నమ్మ పొంగి పోయింది.

"ఊరికే కూకునిమాత్రం సేసేదేముంది? పాపాయమ్మ యిప్పిస్తా నంటావుంది. సూద్దాం" అని వూరుకుంది. ఆమె మనసులో పాపాయమ్మ మాటలు ఒక్కొక్కటే మెదలసాగాయి. నవ్వు వచ్చింది. తనంటే ప్రాణం పెట్టే మొగుణ్ణి పట్టుకుని నానా మాటలు అంది. ఇంతవరకు తనొంటిమీద దెబ్బేసి ఎరగడు-ప్రతీదానికి నెత్తిమీద పెట్టుకుంటాడు. ఆపుకోలేక అదే అంది పాపాయమ్మతో.

"ఏ కష్టాలు చెప్పకుండా నీకు పనెవరిస్తారు" అని గదమాయించింది. తను నోరు మూసుకుని వూరుకుంది. తనకి పనిదొరకడం ముఖ్యం గాని వీటితో ఏమిట్లే అని సరిపెట్టేసుకుంది.

o o o

గున్నమ్మ మేడమీద వున్న ఆఫీసులోకి నీళ్ళు మోస్తోంది. బరువైన కుండ భుజంపైన పెట్టుకొని దడదడ మెట్లు ఎక్కుతోంది. ఆ రోజు తనకి డబ్బు లొస్తాయి. ఆ మాట తల్చుకుంటే ఆమె మనసు ఉల్లాసంతో ఉయ్యాల లూగుతోంది. తన డబ్బుతో మావకి రెండు జుబ్బాలు కొనాలి. వచ్చేసారి ఒక లాగూ బట్ట కొనాలి. ముందుగా ఈ రాత్రి యిద్దరూ కలిసి ఒక సినిమా చూసి పారెయ్యాలి - అంటూ కలలు కంటోంది గున్నమ్మ. ఆలోచిస్తూనే పని చకచకా ముగించుకుంది. కింద పే ఆఫీసులో డబ్బులిస్తారు. వెళ్ళి తెచ్చుకోవాలి.

గున్నమ్మ తడి చేతులు కొంగున గట్టిగా తుడుచుకుని బయలు దేరింది. అక్కడ అప్పటికే నిలబడివున్న పాపాయమ్మని చూసి గతుక్కుమంది.

వారం రోజుల జీతం నలభై రెండులో పది రూపాయలు లాక్కుపోయింది పాపాయమ్మ. గున్నమ్మ చిన్నబుచ్చుకుంది. ఈ పని రావటానికి పాపాయమ్మ పుణ్యమే కదా అని సరిపెట్టుకోవాలని చూసింది. అయితే తను ఆలోచించిన లెక్కలూ, డొక్కలూ తారుమారైనాయి. ముందే తను పాపాయమ్మని లెక్కలో వేసుకుంటే ఈ నిరాశ వుండేది కాదని తనమీద తనే చిరాకు పడిపోయింది - అసంతృప్తిగానే యింటి కొచ్చింది. అయినా ఆ డబ్బులైనా చేతి కొచ్చినందుకు మళ్ళీ ఆనందం ఆమెని చుట్టేసింది.

ఈ విషయాలన్నీ మొగుడికి చెప్పలేదు గున్నమ్మ. ఇద్దరూ ఆ రోజు జల్సాగా గడిపేశారు. లింగయ్య ఎంతొచ్చిందీ అని అడగలేదు. ఆమె చెప్పాలేదు.

లింగయ్యకి జుబ్బాలుకొని, తనొక జాకెట్టు కొనుక్కుంది.

o o o

గున్నమ్మ గుండెల్లో సున్నపుగుల్ల వుడకేసినట్టుగా వుంది. కసితో, కోపంతో వొళ్ళంతా వూగిపోతోంది. ఈ ప్రపంచమే యింత. ఒకడు కష్టపడితే దాని ఫలితంలో భాగాలు ఎంతోమంది పంచుకుంటారు. కష్టపడడంలో భాగం వుండదు. ఫలితంలో మాత్రమే వుంటుంది.

ఆ రోజు లక్ష్మి వచ్చి గున్నమ్మతో మాటలు కలిపింది. ఆమె కూడా గున్నమ్మచేసే పనే చేస్తుంది. ఈ నాలుగు నెలల్లో గున్నమ్మకి, లక్ష్మికి మంచి స్నేహమే అయింది. కాని యీ మాటలు ఇంతవరకూ రాలేదు-లక్ష్మి గున్నమ్మకి ఎన్నో విషయాలు చెప్పింది. రాజకీయాలు

చెప్పింది. వాటిని ఆధారంగా గున్నమ్మ మరింకెన్నో విషయాలు ఆలోచించ గలుగుతోంది. గున్నమ్మ ప్రతి నెల తన డబ్బులో పాపాయమ్మకి కొంత యివ్వడం శుద్ధ దండుగనీ తేల్చింది లక్ష్మి. పాపాయమ్మ అన్యాయంగా డబ్బు గుంజుతోందని గున్నమ్మకి అర్థమయేలా చెప్పింది. అన్ని బోధలూ చేసి "ఈ సారేం చేస్తావ్" అంది లక్ష్మి.

"చస్తే యివ్వను. ఇప్పటికి నూట యాభై పైనే యిచ్చాను. ఇదో బాగోతం అయింది. నేను రెక్కలు ముక్కలు చేసుకుంటుంటే ఈమె గారికి వాళ్ళో పొయ్యాలంట డబ్బు" అంటూ రుసరుసలాడింది గున్నమ్మ.

లక్ష్మి నవ్వింది. "ఈ హెచ్చులకేం గాని ఆ మాట ధైర్యంగా పాపాయమ్మకి చెప్పు" అంది.

వీళ్ళు మాట్లాడుకుంటుండగానే పాపాయమ్మ వచ్చేసింది.

"ఏం టక్కాయ్, ఎన్నాళ్ళిలా యియ్యాలి?" అంది గున్నమ్మ.

"కొత్తగా అడుగుతున్నావేంటి? నువ్వు వున్నన్నాళ్ళూ..." అంది దీర్ఘం తీస్తూ.

"అంటే మరెప్పటికీ యిస్తూనే వుండాలా ఏంటి?"

"ఓ యబ్బో! బాగుంది. నా కోసమా. నీ కోసమా" అంటూ అక్కడి కొస్తున్న లక్ష్మి వంక చూస్తూ "ఇవ్వాల్సింది యిస్తోంది ఏం టమ్మాయి?" అంది.

లక్ష్మి నవ్వి వూరుకుంది. గున్నమ్మకి చిర్రెత్తు కొచ్చింది.

"నే నేంటి నీ కివ్వాల్సింది" అంటూ గయ్యిమని లేచింది. పాపాయమ్మ దెబ్బలాటల్లో ఆరిదేరినఘటం.

"ఏం టివ్వాలా? మరొక్కసారి అ మాటను. కూడు లేక మాడి పోతా వుంటే సాయంచేస్తే, ఏంటే యివ్వాల్సింది అంటావేంటే – నీకు కొవ్వు పట్టకపోతే నీ కిట్టాంటి మాట లెట్టా వస్తాయే" అంటూఅందు కుంది.

గున్నమ్మ వూరుకోలేదు. నోటి కొచ్చినట్టు మాట్లాడింది. ఎదుటి వాళ్ళ కడుపుకొట్టి బలిశావంది. ఒక మాట కాకుండా దులిపేసింది. ఇద్దరూ అరుచుకుంటుంటే వ్యూనొచ్చి –

"ఇది ఆఫీసా, చేపల బజారా, పొండి బయటికి. రోడ్డుమీద జుట్లు పట్టుకోండి" అంటూ తరిమి కొట్టాడు.

ఇద్దరూ చెరోవైపుకి కదిలారు. అయినా జనాంతికంగా తిట్టుకుంటూ వెళ్ళిపోయారు.

గున్నమ్మ పైకి కేకలైతే పెట్టిందిగానీ గుండె దడదడ మొదలైంది. ఈ పాపాయమ్మ తన పనికి ముప్పు తెస్తుంది తప్పకుండా ఈ పని కాస్తా వూడ పీకిస్తుంది. ఉన్నదేదో జాగ్రత్తగా చేసుకోకుండా ఆ ముండ మరీ ఆశ గొట్టుదైపోయింది. ఇన్నాళ్ళు యిచ్చినదంతా గంగలో పోసినట్లయింది. ఇంకా ఇవ్వాలట. ఛీ. తన కష్టం తను తినడానికి లేకుండా పోయింది, అని గిజగిజ లాడింది. తనేం చెయ్యాలి? తనకి దిక్కు ఒక్క శకుంతలమ్మగారే. కాకపోతే పని వొదులుకోవాల్సిందే.

గున్నమ్మ మరింకేమీ ఆలోచించకుండా శకుంతల దగ్గరికి పరుగెత్తింది.

"అమ్మగారూ సూడండి. పాపాయమ్మ ఏడిపించుకు తింటా వుంది. నే రెక్క లమ్ముకున్న డబ్బు దానికి దోచి పెట్టాలంట. అయినా ఇప్పటికి

అయిదు నెల్ల కాడినుంచి ఇస్తూనే వున్నా - ఇంకా వున్నదంతా దోచి పెట్టా లంటమ్మగారూ" అంటూ కళ్ళు వొత్తుకుంది.

"మీ అక్కే కదా. ఎందుకంత బాధ. నువ్వు బాధల్లో వుండగా ఆదుకుంది. ఏదైనా సాయం ఒకళ్ళ కొకళ్ళు చేసుకోవద్దూ" అంది శకుంతల అద్దంలో తన అందాన్ని చూసుకుంటూ.

"అక్కయితే మాత్రం ఆది సహాయం చేసినందుకు నేనేం దాని కష్టం వుంచుకోలేదమ్మగారూ. ఇస్తానే వున్నా. అయినా పీక్కు తినేస్తోంది" అంది మళ్ళీ దీనంగా—

"ఇంతకీ ఏమిటే నీ గోల" అంది శకుంతల ముస్తాబు పూర్తి చేసి.

"అదొచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి, నా పని పోగొడుతుందేమోనని బయంగా వుందమ్మగారూ" అంది గున్నమ్మ.

శకుంతల గలగలా నవ్వింది.

"అది యివ్వమంటే యిచ్చి తీసేయమంటే తీసేయటానికి ఇది దాని సొంత జమానా కాదులే పోవే—నీకేం పర్వాలేదు. నీ పనేం పోదు" అంటూ నవ్వుకుంటూ లోపలి కెళ్ళిపోయింది.

"దండాలమ్మగారూ, చచ్చి మీ కడుపున పుడతా" అంటూ బయట కొచ్చేసింది. జరిగినదంతా లింగయ్యకి చెప్పాలా, వద్దా అని ఆలోచనలో పడింది గున్నమ్మ. ఇన్నాళ్ళు డబ్బు దానికిస్తూ చెప్పనందుకు తనని తిడతాడు. దాని మీదకి తగువుకి వెళ్తాడు. లింగయ్య, ఇలాంటి తగువులొస్తే మనిషి కాడు. ఇన్నాళ్లు అప్పనంగా డబ్బు గుంజిందని తెలిస్తే కత్తి పుచ్చుకుని దాన్ని పొడిచేస్తాడు. ఈ విషయం దాచినందుకు తనని చితకతంతాడు. ప్రస్తుతం మాట్లాడకుండా వుండటం మంచిది, అందుకని ఏం

చెప్పకుండా వూరుకుంది, గున్నమ్మ. అమ్మగారికి ఎట్టాగూ చెప్పకున్నాను కదా అనే ధైర్యం కూడ ఆమెకి బలాన్నిచ్చింది.

o o o

పాపాయమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. లింగయ్య ఆమె చెప్పేది అర్థంకాక అయోమయంగా చూస్తున్నాడు.

"లింగయ్య. నువ్వు మంచోడివి. నీ మనసు ఎన్న పూసొంటిది. నీకు అన్నెం పున్నెం తెలీదు. కానీ లోకం నీకు తెలియకపోయినా సెప్పాల్సిన దరమం నాకుంది. అందుకే ఒక్కమాట సెప్పిపోదామని వచ్చా. దేవుళ్ళాటి మొగుణ్ణెట్టుకుని నీ ఆడది సరైనపని సెయ్యటం లేదయ్యా" అంది.

లింగయ్య చురుగ్గా ఆమె వంక చూశాడు.

"ఈమాట సెప్తే నీకు నమ్మకంగా వుండదు. కానీ నీ బాగు కోరే దాన్ని. మీరిద్దరూ సిలకా గోరింకల్లాగ వుండాలనుకునేదాన్ని. అది వినోడ్ని ఎర్రోణ్ణిసేసి నాటకాలాడతా వుంటే నాకు బాదేసి సెప్తున్నా మరి నీ ఇష్టం" అంది.

లింగయ్య కోపంతో వూగిపోయాడు.

"ఏంటీ నువ్వు సెప్పేది నిజమైతే దాన్ని మక్కెలిరగదంతా" అంటూ అరిచాడు.

"అబద్ధాలు నాకెందుకు నాయనా. అది మాత్రం నా బిడ్డలాంటిది కాదూ" అంది ప్రేమ ఒలకపోస్తూ. లింగయ్య ఒక్కక్షణం ఆలోచించాడు.

"ఆదలాంటిది కాదొదినా" అన్నాడు బాధగా. "నిజమే మరి లోకం

అటువంటిది. సూడసక్కని గుంట. వందమంది మగోళ్ళలో పని దానికి. కోటిన్నర సరదాలు_ దాన్నని ఏం లాభంలేదు..." అంటూ సాగ దీసింది.

లింగయ్య యిక వినలేకపోయాడు.

"పెద్దముండాదాన్ని. నామాటంటే దాన్ని పన్లోకి పంపకు. నేను పని ఇప్పించాను కనుక దాని బాగోగులు సూత్తావున్నా.-ఏం? ఆ మాత్రం నువ్వు సంపాదించలేవా ఏంటి?" అంది లింగయ్యని నిలేస్తూ.

లింగయ్య పురుషత్వం విరగ పడింది. అయినా ఆడదాన్ని బయటకి పంపటమేమిటి? అని అభిమానపడిపోయాడు.

"జాగరత్త నాయనా. సంపాదనకంటే సంసారం ముఖ్యం" అని పాపాయమ్మ వెళ్ళిపోయింది.

o o o

ఎండ చర్రున పెరుగుతోంది. అంతా లేచి ఎవరి పనుల్లోకి వాళ్ళు వెళ్ళిపోతున్నారు. గున్నమ్మ మంచంమీద దిగులుగా పడుకుంది. తనీరోజు నుంచి పనులో కెళ్ళటానికి వీల్లేదని మావ గట్టిగా చెప్పాడు. తను ఘర్షణ పడింది. ఎప్పుడూ లేనిది అతని చేతిలో దావుదెబ్బలు తింది. పాడు పని కోసం బంగారంలాంటి యిల్లు, వాకిల్నీ, మొగుణ్ణీ వదులుకోలేదు. కాని తనకి జరిగిన అన్యాయానికి ఎవరు బాధ్యులు? ఈ అన్యాయాన్ని ఎవరు అరికట్టగలరు? తన కష్టం తనని పడనీయరు. తన కూడు తనని తిన నీయరు పాపాయమ్మలాంటి దుర్మార్గులు.

గున్నమ్మ నున్నటి చెంపలమీంచి కన్నీరు ప్రవహిస్తోంది. అశక్తతగా, అలా మంచంమీద ముడుచుకుని పడుకుంది.

●